క్లుప్తంగా

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శైలజ

ఆదోనిరూరల్ : విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శైలజ సూచించారు. శుక్రవారం మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నోబుల్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించాలని పిలుపునిచ్చారు. బాగా చదువుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ర్యాగింగ్ చట్టవిరుద్ధమని, ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోరాదన్నారు. మానసిక వైద్యులు ర్యాగింగ్ వల్ల వచ్చే సమస్యలు, మానసిక ఒత్తిడిపై విద్యార్థులకు వివరించారు. కరస్పాండెంట్ దేవదానం, న్యాయవాదులు ఆనంద్, వీరేష్, విశ్వనాథ్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా సాగుతున్న ఇళ్ల నిర్మాణాలు



జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

ఆదోని సెంట్రల్: ప్రభుత్వం నిర్మించే ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. పట్టణానికి సమీపంలో 170.81 ఎకరాల్లో జగనన్న కాలనీ ఏర్పాటు చేశారు. అందులో 9,327 మందికి ప్లాట్లు కేటాయించారు. మొదటి విడతగా 5,101 ఇళ్లు మంజూరయ్యాయి. 93 ఇళ్లు టాప్ వేయగా 38 ఇళ్లు రూఫ్ లెవల్‌లో ఉన్నాయి. 51 ఇళ్లు లెంటల్ లెవల్ నిర్మాణంలో ఉండగా 3,391 ఇళ్లు బేస్‌మట్టం లెవల్‌లో ఉన్నాయి. 1,528 ఇళ్లు ప్లింత్ బీమ్ స్థాయిలో కొనసాగుతున్నాయని హౌసింగ్ డీఈ రవికుమార్ తెలిపారు. ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించినట్లు చెప్పారు. వర్షాలు కురువడం, లేబర్ సమస్యలు వల్ల పనులకు అంతరాయం కలుగుతుందన్నారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ఉపాధ్యాయులు

కౌతాళం: మండల పరిధిలోని బదినేహాల్ గ్రామ జెడ్పీ పాఠశాల విద్యార్థులు అథ్లెటిక్స్ ప్రతిభ చూపారని హెచ్‌ఎం హరినాథ్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జంపాపురం ఉన్నత పాఠశాలలో ఆర్టీటీ ఆధ్వర్యంలో జరిగిన అథ్లెటిక్ పోటీల్లో పదవ తరగతి చదువుతున్న నాగలక్ష్మి షాట్‌పుట్‌లో బంగారం పథకం, 9వ తరగతి చదువుతున్న నజీనా 200 మీటర్ల పరుగు పందెంలో రజత పథకాన్ని కైవసం చేసుకున్నారని చెప్పారు. అనంతరం వారిని అభినందించారు. వ్యాయమ ఉపాధ్యాయుడు నరసింహరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ సర్వేపై అనుమానాలు అవసరం లేదు



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

ఆదోనిరూరల్ : భూసర్వేపై ఏ ఒక్క రైతు అనుమానం, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని తహసీల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు. శుక్రవారం మండలంలోని ధణాపురం గ్రామంలో భూ సర్వే గురించి గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, డిప్యూటీ భూసర్వేయర్ పెద్దయ్య పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వీఆర్వో విష్ణుప్రియ, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు నరసింహమూర్తి, మాజీ సర్పంచ్, మండల కన్వీనర్ ఈరన్నగౌడ్, ఎంపీటీసీ హనుమయ్య, గ్రామ సర్వేయర్ నరేష్ పాల్గొన్నారు.

వంటసామగ్రి అందజేత



వంట సామగ్రిని ఆలయ పూజారికి అందజేస్తున్న దృశ్యం

ఆదోనిటౌన్: కౌతాళం మండలం బాపురం గ్రామంలో వెలిసిన శ్రీ శాంభవిదేవి ఆలయానికి పట్టణంలోని క్రాంతినగర్‌లో నివాసముంటున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌గౌడ్ వంటసామగ్రిని శుక్రవారం విరాళంగా అందజేశారు. రూ.40 వేలకు పైగానే విలువజేసే పాత్రలు, మూతలు, గరిటెలు అందజేశామని తెలిపారు.

మహిళా శక్తి పేరుతో మోసానికి నాంది



ద్వాక్రా మహిళలకు మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం: గత ఎన్నికల్లో పసుపు,కుంకుమ పేరుతో డ్వాక్రా మహిళలను ముంచిన చంద్రబాబు ఇప్పుడు మహిళా శక్తి పేరుతో మరోసారి మోసం చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి విమర్శించారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి కార్యాలయం ఆవరణలో నిర్వహించిన సున్నా వడ్డీ పథకం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు పెద్ద పీట వేశారన్నారు. రాజకీయాల్లోనూ 50 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించడం అభినందనీయమన్నారు. 2014లో లేనిపోని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వాటిని అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. 2019లో జగనన్న మాటను నమ్మి గెలిపించారని, ఆయన కూడా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి ఆదర్శంగా నిలిచారన్నారు. మహిళల అభివృధే ధ్యేయంగా జగనన్న అనేక పథకాలను ప్రవేశ పెట్టారని చెప్పారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే 2024లో కుడా జగనన్నను సీఎంగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం మంత్రాలయం, కోసిగి, పెద్దకడబూరు, కౌతాళం మండలాల్లోని 5,094 గ్రూపులకు గాను రూ.5.27 కోట్లు విలువ చేసే మెగా చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేశారు. శిథిలావస్థకు చేరిన వెలుగు, ఎంపీడీఓ కార్యాలయాలను పరిశీలించి మరమ్మతులకు నివేదికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమారెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచ్ లు తెల్లబండ్ల భీమయ్య, పాల్‌దినాకరన్, ఎంపీడీఓలు మణిమంజరి, సుబ్బరాజు, ఏపీఎంలు జయశ్రీ, సత్యమ్మ,రాజశేఖర్,శాంతి, ఎంపీపీలు ఈరన్న, అమరేష్, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, ప్రహ్లాదాచారి, జాము ముక్కన్న, మాజీ జెడ్పీటీసీ మంగమ్మ, సచివాయ మండల కో కన్వీనర్ వీకేసీ రాఘవేంద్ర ఆచారి, ఉపసర్పంచ్‌లు హోటల్ పరమేష్, వీరనాగప్ప, నాయకులు జనార్దన్‌రెడ్డి, సోమిరెడ్డి, శివకుమార్, వీరయ్యశెట్టి, రామకృష్ణ ఉన్నారు.

వాడవాడలా అభివృద్ధి



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్ : ఆదోని మున్సిపాలిటీ వాడవాడను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ప్రతి కాలనీలోనూ సీసీ రోడ్లు, మురుగు కాలువలు, కల్వర్టులు, తాగునీటి పైపులైన్లు, ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు, సామూహిక మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులను కల్పిస్తున్నామన్నారు. శుక్రవారం 31వ వార్డు గణేష్ సర్కిల్, బుడ్డేకల్, వడ్డేగేరి ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటిని సందర్శించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరిస్తూ ప్రజల సమస్యలను, కష్టాలను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది అమ్మఒడి అందలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే వెల్ఫేర్, అడ్మిన్‌లతో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాలుగు సంవత్సరాల పాలనలో సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చి ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించే దిశగా ప్రభుత్వం అడుగులేస్తుందన్నారు. పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో జగనన్నను సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయశాంత, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పోలకల్ రేణుక, పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, అధ్యక్షుడు దేవా, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, కౌన్సిలర్ ప్రతిభ, వార్డు ఇన్‌చార్జ్ బి.టి.లక్ష్మణ్, బి.టి.గోవిందు సోదరులు, నాయకులు రామలింగేశ్వర యాదవ్, తాయన్న, మునిస్వామి, నగరూరు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, చిన్నఈరన్న, జైపాల్, కిషోర్, సునార్ అబ్దుల్‌ఖాదర్, రహమాన్, సనాఖాన్ ఇక్బాల్, అధికారులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ముఖ్యం



మురుగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సాయి

ఆదోనిటౌన్ : ప్రజా ఆరోగ్యమే ముఖ్యమని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి సూచించారు. శుక్రవారం 31వ వార్డు బుడ్డేకల్ వీధిలో ప్రధాన మురుగు కాలువలో పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందని, అంటువ్యాధులబారిన పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఆయన కాలువలను పరిశీలించారు. కాలువను వెంటనే శుభ్రం చేయాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమను ఆదేశించారు. నెలరోజులపాటు పూడికతీత పనులు పట్టవచ్చని, 60 మంది కార్మికులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిన తీసుకొని పనులు పూర్తి చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పనులు చేపడతామని అసిస్టెంట్ కమిషనర్ ఎమ్మెల్యేకు సమాధానమిచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోనిఅర్బన్: పట్టణంలో ఆయా కాలనీల్లో మరమ్మతులు ఉండటంతో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీఈ పురుషోత్తం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆదోని కొండల్లో చిరుత సంచారం!

ఆదోని సెంట్రల్: పట్టణ సమీపంలోని కొండల్లో చిరుత సంచారిస్తుందని తెలియడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. శుక్రవారం ఉదయం రణమల కొండల్లో పొలం పనులకు వెళ్లే వారు చిరుతను చూసినట్లు మిత్రులకు, బంధువులకు తెలియజేశారు. ఈ సమాచారం పట్టణమంత వ్యాపించింది. కొండల్లో వున్న గుళ్లు,దర్గాలకు నిత్యం ప్రజలు తిరుగుతుంటారు. ఈ రహదారి గుండా చాలామంది దొడ్డనగేరి గ్రామానికి వెళ్తుంటారు. రెండు మూడు రోజుల్లో శ్రావణ మాసం ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయని, చిరుత సంచారం తెలుసుకొని భక్తులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయంపై ఫారెస్టు రేంజ్ అధికారి తేజశ్వనిని వివరణ కోరగా చిరుత సంచారంపై తమకు ఎలాంటి సమాచారం అందలేదన్నారు. సిబ్బందితో విచారణ చేయించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

శాశ్వత భూ హక్కుతో రైతులకు లబ్ధి



భూ రక్ష పత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష కార్యక్రమంతో రైతులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని పీకలబెట్ట, బాపులదొడ్డి, మేకడోణ గ్రామాల్లో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకంలో రీ సర్వే చేసిన సర్వే పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రజల భూములు, ఆస్తుల రక్షణకు ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. భూ రక్ష పత్రాల ద్వారా లబ్ధిదారులు బ్యాంక్‌లలో రుణాలు పొందే సౌకర్యం ప్రభుత్వం కల్పించిందన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయాలైన బాపులదొడ్డి మాజీ సర్పంచ్ అయ్యప్పను పరామర్శించి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతోరూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు లక్ష్మి, కృష్ణగౌడ్, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు విజయేంద్రరెడ్డి, నాయకులు గజేంద్రారెడ్డి, పూజారి ఈరన్న, మూకరెడ్డి, మహాదేవ, షేక్‌ఖాన్‌పటేల్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి

ఆదోనిరూరల్: పట్టణంలోని భీమరెడ్డి కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వీధిలైట్లు వేయాలని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం క్యాండిల్లతో నిరసన తెలియజేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, తిప్పన్న, ముక్కన్న, పట్టణ నాయకులు కృష్ణమూర్తి, నాగరాజు, కాలనీవాసులతో కలిసి నిరసన తెలియజేశారు.

ఉరుకుంద రోడ్డుకు మరమ్మతులు



ఏరిగేరి-ఉరుకుంద రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం

కౌతాళం: మండలంలోని ఉరుకుంద రోడ్డుకు మరమ్మతులు పనులు చేపట్టారు. ఉరుకుంద ఈరన్న స్వామి ఉత్సవాలు ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభమై నెల రోజుల పాటు జరుగనున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఏరిగేరి గ్రామం నుంచి ఉరుకుంద వరకు రోడ్డు దెబ్బతినడంతో.. రోడ్డు పనులు చేపట్టాలని ఇటీవల జరిగిన సమన్వయ సమావేశంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆర్ అండ్‌బీ అధికారులను ఆదేశించారు. దీంతో వారు రోడ్డుకు మరమ్మతులు చేస్తున్నారు. గుంతలు ఉన్న చోట తాత్కలికంగా కంకర వేసి రోలర్‌తో చదును చేస్తున్నారు.

ఇంటికో మొక్క నాటాలి

కౌతాళం: మారుతున్న వాతవరణం కారణంగా ప్రతి ఇంటికో మొక్కను నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ తెలిపారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా కళాశాలలో శుక్రవారం మొక్కలు నాటారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీనివాస రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

ఆదోనిరూరల్ : మండిగిరిలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి, మాజీ సర్పంచ్ శేషిరెడ్డి ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి శుక్రవారం పాలాభిషేకం చేశారు. వెలుగు సీసీ తిక్కన్న, బుక్ కీపర్ శోభ, గ్రామైక్య సంఘం లీడర్లు గిరిజమ్మ, అరుణమ్మ, మహంకాళి, పార్వతి పాల్గొన్నారు.

కంటి జబ్బుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఆదోనిఅర్బన్: విద్యార్థులు కంటి జబ్బుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కంటి వైద్యనిపుణుడు, వెస్సార్‌సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం స్థానిక అక్షరశ్రీ రెసిడెన్షియల్ స్కూల్‌లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి కలక ఎక్కువగా ఉన్న పిల్లలకు మందులు అందజేసి వారికి అవగాహన కల్పించి నివారణ చర్యలు తెలియజేశారు. స్కూల్ కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులు ఈ-క్రాప్ చేయించుకోవాలి



ఈ-పంట ప్రక్రియను పరిశీలిస్తున్న ఏఓ

మంత్రాలయం రూరల్: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి జీర గణేష్ సూచించారు. శుక్రవారం సూగూరు, బూదూరు, చిలకలడోణ తదితర గ్రామాల్లో ఈ-క్రాప్ బుకింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ.. రైతులు ఈ- పంట నమోదు చేయించుకోవడంతో సంక్షేమ పథకాలు వర్తిస్తాయని చెప్పారు. ఏఈవో నరసింహులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని యువకుడి మృతి



మృతి చెందిన సోను

ఆదోనిరూరల్ : మండలంలోని గణేకల్ క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడని పెద్దతుంబళం ఎస్‌ఐ చిన్నపీరయ్య తెలిపారు. వివరాలు.. ఆదోని పట్టణం శంకర్‌నగర్‌లో నివాసముంటున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన సోను (29) రోజూ త్రీవీలర్ మోటార్ సైకిల్‌పై గ్రామాలకు వెళ్లి ఐస్‌క్రీం విక్రయించి జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో శుక్రవారం పెద్దతుంబళం తదితర గ్రామాల్లో ఐస్‌క్రీం అమ్మి తిరిగి వస్తుండగా గణేకల్ క్రాస్ వద్ద వెనక నుంచి వస్తున్న టిప్పర్ (ఏపీ39యూకే 2027) ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

మణిపూర్ బాధితులకు అండగా నిలుద్దాం



ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్: మణిపూర్ బాధితులకు అండగా నిలిచి వారికి భరోసా కల్పిద్దామని పీడీఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. సురేష్ పిలుపు నిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె. తిరుమలేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అటవీ సంపదను కొల్లగొట్టి పెత్తందారులకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం విద్వేషాలను రెచ్చగొట్టడంతో అల్లరి మూకలు మరింత రెచ్చిపోతున్నాయని చెప్పారు. స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర అధ్యక్షుడు సి.విజయ్ మాట్లాడుతూ మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులు సంజీవ్, బసవ, సుజ్ఞానమ్మ, కళావతి, విరుపాక్షిరెడ్డి, పీడీఎస్‌ఓ నాయకులు ఖాదర్ అశోక్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలి



సమావేశమైన అఖిలపక్ష పార్టీల నాయకులు

ఆదోనిరూరల్ : కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న అన్నారు. శుక్రవారం పట్టణంలోని సుందరయ్యభవన్‌లో మూడు సంఘాల సంయుక్త సమావేశాన్ని సీఐటీయూ మండల కార్యదర్శి బి.వీరారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 14వ తేదీన చేపట్టే జనజాగరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మతత్వ విధానాల ద్వారా ప్రజల మధ్య విబేధాలు సృష్టిస్తోందని విమర్శించారు. రైతుసంఘం మండల కార్యదర్శి అయ్యప్ప, సీఐటీయూ మండల అధ్యక్షుడు రామాంజనేయులు, రైతుసంఘం నాయకులు బాషా, కార్యదర్శి దస్తగిరిబాషా, ఉరుకుంద, ఏలియా పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కోసిగి: మండల పరిధిలోని జంపాపురం గ్రామానికి చెందిన చెన్నబసవ అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. శుక్రవారం ఉదయం పొలం పనులకు వెళ్లాడు. పొలంలో పత్తి విత్తనాలు మొలకెత్తక పోవడంతో మనోవేదనకు గురై అక్కడ పురుగు మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆయనను ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నట్లు తెలిసింది.

ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలి



పెద్దకడబూరులో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య ఉద్దేశమని ఎంపీపీ శ్రీవిద్య పేర్కొన్నారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ సున్నా వడ్డీ నాలుగవ విడత పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పొదుపు మహిళలతో కలిసి పాలాభిషేకం చేశారు. ఆమె మాట్లాడుతూ మండలంలో 2019-20లో 734 గ్రూప్‌లకు రూ.1.22కోట్లు, 2020-21లో 1,095 గ్రూప్‌లకు రూ.1.46కోట్లు, 2021-22లో 1,174 గ్రూప్‌లకు రూ. 1.48కోట్లు, 2022-23 సంవత్సరంలో 1,177 గ్రూప్‌లకు రూ.1.29కోట్లు మొత్తం రూ. 5.46 కోట్లు నేరుగా మహిళలకే అందించిన ఘనత జగనన్నకే సాధ్యమన్నారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి జగనన్నను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెలుగు సీసీ చెన్నయ్య, ప్రసన్నరాణి, అకౌంటెంట్ కృష్ణవేణి, వీఓఏలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల్లో అన్ని సౌకర్యాలు



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దారు

కౌతాళం: పోలింగ్ బూత్‌ల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలింగ్ బూత్‌ల్లో ర్యాంపు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్ వంటి వాటిని పరిశీలించినట్లు చెప్పారు. ప్రతి పోలింగ్ బూత్‌లో అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ముమ్మరంగా అభివృద్ధి పనులు



ట్రాక్టర్‌తో మట్టిని చదును చేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో ఈనెల 17వ తేదీ నుంచి శ్రావణమాస ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వివిధ అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా రూ.1.28కోట్లతో జరుగుతున్న బండపరుపు పనుల కోసం మహాప్రాకారంలోని లోపలి భాగంలో మట్టిని ట్రాక్టర్‌తో చదును చేస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండదని పనులను వేగవంతం చేసినట్లు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు.

ఇంటింటి సర్వే పరిశీలన



చెట్నేహళ్లిలో సర్వేను పరిశీలిస్తున్న ఆర్వో రమా

మంత్రాలయం రూరల్: ఓటరు జాబితా ఇంటింటి సర్వేను మంత్రాలయం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమా శుక్రవారం తనిఖీ చేశారు. చెట్నేపల్లి, మాధవరం గ్రామాల్లో అధికారులు నిర్వహిస్తున్న ఇంటింటి ఓటరు జాబితా పరిశీలన కార్యక్రమం సక్రమంగా జరుగుతుందో లేదోనని తెలుసుకున్నారు. బీఎల్‌వోలు, సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

శ్రీ మఠంలో ప్రముఖులు



పీఠాధిపతి నుంచి మెమెంటో అందుకుంటున్న ఎస్పీ కృష్ణకాంత్



శ్రీ మఠంలో ప్రదక్షిణలు చేస్తున్న భార్గవ్ తేజ

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు కర్నూల్ జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, కర్నూల్ మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ శుక్రవారం మంత్రాలయం వచ్చారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనంను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వీరికి శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థులు శేషవస్త్రం, స్వామి వారి మెమొంటో, ఫలమంత్రాక్షితలిచ్చి ఆశీర్వాదించారు. వీరితో పాటు తహసీల్దార్ చంద్రశేఖర్, సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు,కిరణ్ ఉన్నారు.

పార్కింగ్ ప్రదేశాల పరిశీలన..

శ్రావణ మాసం, శ్రీ రాఘవేంద్రస్వామి ఆరాధన ఉత్సవాల నేపథ్యంలో మంత్రాలయం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులకు లేకుండా పార్కింగ్ ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ సూచించారు. శుక్రవారం సాయంత్రం తుంగభద్ర నది తీరంలోని పుష్కర ఘాట్, నదికి వెళ్లే సమయంలో భక్తుల వాహనాలు నిలుపుకునేందుకు అసవరమైన ప్రదేశాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజును ఆదేశించారు.

ఎలా వెళ్లాలి?

కౌతాళం: మండలంలోని బదినేహాల్ గ్రామంలోనున్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుకు వెళ్లే దారి వర్షపు నీటితో నిండిపోయింది. బ్యాంక్ ఆవరణలో మోకాలు లోతు వర్షపు నీరు నిలిచిపోవడంతో ఖాతాదారులు పనుల నిమిత్తం బ్యాంక్‌లోకి వెళ్లడానికి అవస్థలు పడుతున్నారు. వెళ్లే క్రమంలో కొందరు నీటిలో పడిపోతున్నారు. దీంతో శుక్రవారం సీపీఎం నాయకులు బ్యాంకు ఎదుట నిరసన తెలిపి బ్యాంకు మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు.సీపీఎం మండల కన్వీనర్ ఈరన్న మాట్లాడుతూ మోకాళ్ల లోతు నీళ్లు నిలిచిపోవడంతో ఖాతాదారులు బ్యాంకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వాటిని బయటకు పంపే చర్యలు చేపట్టాలని కోరారు. ఉలిగయ్య, శంకర్, మాబాష, చాంద్ పాల్గొన్నారు.



ఏపీజీబీ ఎదుట నిలిచిన వర్షపునీరు